క్లుప్తంగా

నేటి నుంచి దేవరాపల్లిలో ఉచిత యోగా శిక్షణ

దేవరాపల్లి: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు దేవరాపల్లిలో ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు యోగా గురువు గెద్దం నగేష్ తెలిపారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. యోగాతో పాటు క్రీడాకారులుగా రాణించాలనుకునే వారు 95422 93555, 91828 56530 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

5 నుంచి ఆధార్ శిబిరాలు

మాడుగుల: ఈ నెల 5వ తేదీ నుంచి ఆధార్ శిబిరాలు ప్రారంభమవుతాయని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు మొదటి విడత, 13 నుంచి 16వ తేదీ వరకు రెండో విడత ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మండలంలో వీరనారాయణం, ఎల్.పొన్నవోలు, కె.వల్లాపురం, కేజేపురం గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆధార్‌లో తప్పులు దొర్లిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

కూలీలకు వంద రోజుల పని కల్పించాలి



గిడుతూరులో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఆదేశించారు. మండలంలోని గిడుతూరు, మల్లవరం గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడారు. రూ.300 గిట్టుబాటు కూలీ రావాలంటే చేయాల్సిన పని వివరాలను తెలియజేశారు. అనంతరం గిడుతూరులో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, ఈ కేంద్రం ద్వారా ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిడుతూరు సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ చినబాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వీరవల్లి అగ్రహారంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో గురువారం జరిగిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పోతనపూడి గ్రామానికి చెందిన దివంగత శ్రీనాథు కనకమహాలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు రమేష్, వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వడ్డి సత్యారావు ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. విశాఖకు చెందిన పలు కార్పొరేట్ ఆస్పత్రుల ప్రత్యేక వైద్య నిపుణులు సుమారు 350 మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఆంకాలజిస్టులు పాల్, మురళీకృష్ణ, హరిక, పీఆర్వో పి.ఎం.నాయుడు, ఎస్ఆర్ఐ ఆస్పత్రి వైద్య నిపుణులు పరమేశ్వరరావు, హరికిశోర్, సుజిత్‌కుమార్, సౌమ్య, హేమంత్, సుజాత, పీఆర్వో త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న లియాఫీ నూతన కార్యవర్గం సభ్యులు

చోడవరం: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫీ) చోడవరం బ్రాంచి యూనియన్‌కు నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. యూనియన్ అధ్యక్షుడిగా సలాది చండీశ్వరరావు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గూనూరు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా పైల నాగరాజు, కోశాధికారిగా పాలకుర్తి సురేష్‌కుమార్, అర్బన్ ఉపాధ్యక్షుడిగా లాలం శ్రీనివాసరావు, రూరల్ ఉపాధ్యక్షుడిగా సూరిశెట్టి నారాయణరావు, రెసిడెన్షియల్ సెక్రటరీగా కసిరెడ్డి జగన్, జాయింట్ సెక్రటరీగా అల్లాడ సత్యారావు, కోటాన అప్పారావు, మహిళా ప్రతినిధులుగా పాలకుర్తి వరలక్ష్మి, శ్రీనాథుని దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ఎస్.గజపతిరావు, తిరుమలరావు, శివకుమార్ పర్యవేక్షణలో జరిగింది. ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు చండీశ్వరరావు తెలిపారు.

హద్దుల్లేని అక్రమ రవాణా..!

- తనిఖీలు మరిచిన అధికారులు
- ప్రమాదకరంగా రాయి లోడుతో లారీల రాకపోకలు



అధిక లోడుతో వెళ్తూ ఆగిన టిప్పర్

నర్సీపట్నం: నర్సీపట్నం పరిసర ప్రాంతాలనుంచి ఖనిజ సంపద అక్రమంగా రవాణా అవుతోంది. డివిజన్ మైనింగ్, రవాణ, పోలీసు శాఖ అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండటంతో పలువురు అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. నల్లరాయి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రోడ్లు శిథిలమవుతున్నందున అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై కేసులు పెట్టాలని సాక్షాత్తు స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించిన సందర్భాలు లేకపోలేదు. ఇదే విషయాన్ని నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ, జనసేన, టీడీపీ కౌన్సిలర్లు లేవనెత్తారు. పరిమితికి మించిన రాయి లోడుతో లారీలు రాత్రింబవళ్లు పట్టణ మెయిన్ రోడ్డుపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని కౌన్సిలర్లు పేర్కొన్నారు. రద్దీ ప్రాంతం మీదుగా వెళ్తున్న లారీల నుంచి ఏమాత్రం రాయి జారి పడినా మనుషుల ప్రాణాలకే ముప్పు ఉందని తెలిసినా ఎందుకు కేసులు పెట్టడం లేదని కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు.

నిత్యం ఇదే తంతు.!

ప్రతి 100 నుంచి 150 టిప్పర్లు, లారీలు రాయి లోడుతో నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. పరిమితికి మించి రాయి తరలిస్తున్న లారీ వల్ల పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో పాటు పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయి లోడుతో వెళ్తున్న లారీల వల్ల ఇళ్లకు సంబంధించిన విద్యుత్ వైర్లు తెగిపడుతున్నాయి. ఆ సమయంలో లారీలు ఆగకుండా క్షణాల్లో మాయమవుతున్నాయి. కొత్త సర్వీసు వైర్ల ఏర్పాటుతో వినియోగదారులు చేతి చమురు వదిలించుకుంటున్నారు. అధిక లోడుతో పాటు లారీలు వేగంగా వెళ్తుండడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గనుల శాఖ అధికారులు బిల్లులు ఉన్నాయో? లేవో? తనిఖీ చేయకుండా కార్యాలయానికి పరిమితమవుతున్నారు. పోలీసుల కళ్లెదుట నుంచే లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు. విచ్చల విడిగా తిరుగుతున్న లారీలకు అడ్డుకట్ట వేయకపోతే అడ్డుకుని తీరుతామని కౌన్సిలర్లు హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఎస్ఐ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి లారీల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.1.50 కోట్లతో తాండవ కాలువలో పూడిక తీత



గాంధీనగరం వద్ద తాండవ కాలువలో పూడిక తీతకు భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నాతవరం: తాండవ కాలువలో పూడిక తీత పనులకు ఉపాధి హామీ పథకం కింద రూ.1.50 కోట్ల నిధులు మంజూరైనట్టు ఏపీవో దాసరి కొండాజీ తెలిపారు. మండలంలో గాంధీనగరం సమీపంలో తాండవ కాలువలో పూడికతీత పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఈ ఏడాది నుంచే తాండవ ప్రధాన కాలువలో పూడిక తీత పనులు ఉపాధి నిధులతో చేపడతామన్నారు. తాండవ కాలువలో సిమెంట్ లైనింగ్ చేయడం, అవి దెబ్బతినకుండా ఏ విధంగా చేయాలనే విధానంపై కూలీలకు అవగాహన కల్పించామన్నారు. పిల్ల కాలువలను సిమెంట్ లైనింగ్ పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పూడిక తీత పనులకు ఉపాధి హామీ పథకంలో 52 వేలు పని దినాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, శృంగవరం మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, తాండవ నీటి సంఘం అధ్యక్షుడు పేర్రాజు కొత్త సతీష్, పాల్గొన్నారు.

సమర్థవంతంగా 'కిశోర వికాసం' అమలు



సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం: కిశోర వికాసం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సీడీపీవో మేరీ సువార్త పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ రూపొందించిన కిశోర వికాసం-వేసవి శిక్షణా కార్యక్రమాల ప్రణాళికను అంగన్‌వాడీ కార్యకర్తలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు అన్ని కేంద్రాల్లో ప్రణాళికలో సూచించిన కార్యక్రమాలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు, ఉన్నత విద్య, నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం, సైబర్ నేరాలు, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, సాధికారత, శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, నివారణపై సంబంధిత అధికారులను సమన్వయం చేసుకొని అవగాహన కల్పించాలన్నారు.

అరుణ పతాక రెపరెపలు

వాడవాడలా మే డే వేడుకలు



నర్సీపట్నంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు



వడ్డాదిలో మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు



మర్రివలసలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కాసుబాబు



మాకవరపాలెంలో మే డే వేడుకల్లో పాల్గొన్న ఆటో కార్మికులు



నాతవరంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న యూనియన్ నాయకులు



దేవరాపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత వెంకన్న



సీఐటీయూ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు

నర్సీపట్నం: వాడవాడలా అరుణపతాకం రెపరెపలాడింది. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నర్సీపట్నం, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లి, శివపురం, కృష్ణాబజార్, బలిఘట్టం, కలాసీ కాలనీ, ఆటో స్టాండ్, ఇందిరా మార్కెట్‌లో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చట్టంను రద్దు చేస్తున్నారని, కార్మికులు మేడే స్ఫూర్తితో పోరాడాలన్నారు. ఆర్టీసీ డిపో వద్ద ఎర్ర జెండాను ఎగుర వేసి మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది, బుచ్చెయ్యపేట, సీతయ్యపేట, రాజాం, తదితర గ్రామాల్లో ఆటో, తాపీమేస్త్రీ, కలాసీ, పలు కార్మిక సంఘ నాయకులు, కార్మికులు, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. జెండా వందనం చేశారు. పలు సంఘాల నాయకులు సాంబశివరావు, నాయుడు, మరిసా సతీష్, నాగ అప్పారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని మర్రివలస కూడలిలో మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు, రామచంద్రపురంలో గొర్లె దేముడు బాబు, దాలివలసలో దమ్ము ముత్యాలనాయుడు, కె.కోటపాడులో పొంతపల్లి రామారావు నిర్వహించారు. కె.కోటపాడులో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెంలో మణికంఠ ఆటో యూనియన్ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్టీసీ బస్టాండు వద్ద, రిక్షా కార్మికులంతా సాయిబాబా గుడివద్ద జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు చిట్టిబాబు, శేషు, ఏసు, సూరిబాబు, రవిశేఖర్ పాల్గొన్నారు.

నాతవరం: మండల కేంద్రం నాతవరం కూడలిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని, దీనిని అడ్డుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పలుకుతుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఉద్యమంతో అడ్డుకోవాలన్నారు. నాతవరం, డి.యర్రవరం, శృంగవరం, సరుగుడు గ్రామాల్లో నిర్వహించిన మేడే వేడుకల్లో యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు కె.ప్రసన్న, డివిజన్ మండల నాయకులు వసంత, సత్యవతి, రాజేశ్వరి, కన్నతల్లి, లక్ష్మీభాయి, ముఠా కార్మిక సంఘం నాయకుడు తాతారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.చంటి, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎం.గంగాధర్ మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్కీమ్ వర్కర్ల జీతాలు పెంచుతామని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేస్తామని హామీలు ఇచ్చి మోసగించిందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, ముఠా, ఆటో, తోపుడు బళ్లు, రిక్షా, చిరు వ్యాపారులకు సమగ్ర చట్టం చేస్తామని చెప్పి, కనీసం ప్రయత్నించకపోవడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.సూరిబాబు, జి.రాము, పి.ఈశ్వరరావు, టి.ప్రసాద్, యు.శ్రీను, ఎస్.కొండబాబు, పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

చోడవరం: ఏఐటీయూసీ కార్యాలయం పాత బస్టాండ్ వద్ద డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మేడే సందర్భంగా జెండా ఎగురవేశారు. రిక్షా కార్మికులు, హమాలీలు, వ్యాన్, ఆటో యూనియన్ల డ్రైవర్లు, యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాత బస్టాండ్ నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ చేసి, మానవహారం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు నేమాల నర్సింగరావు, కిల్లి లక్ష్మయ్య, కామిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంఘాలన్నీ మేళతాళాల మధ్య ఎంతో ఉల్లాసంగా వేడుకలు నిర్వహించాయి. చోడవరం డివిజన్ పరిధిలో ఉన్న సుమారు 60 సంఘాలు ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్‌రాజు పాల్గొని చోడవరంలో శ్రమశక్తి భవనం నిర్మాణానికి రూ.కోటిన్నర నిధులు మంజూరు చేస్తున్నామని, మొదట విడతగా రూ.50 లక్షలు నిధులు విడుదల చేస్తున్నట్టు సంబంధిత పత్రాన్ని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులకు అందజేశారు. వందలాదిగా తరలివచ్చిన కార్మికులంతా స్థానిక కాలేజీ జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీబాలగణపతి సోలాపూరమ్మ, సిద్ధి వినాయక, చోడవరం డివిజన్ భవన నిర్మాణ కార్మికుల సంఘాల నాయకులు కొసర తాతారావు, కొసర సోమేశ్వరరావు, జనపరెడ్డి రామకృష్ణ, బత్తిన రమణ, గుమ్మాలపరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు చోడవరం మెయిన్ రోడ్డు మీదుగా భారీ ప్రదర్శన చేశారు. కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం చేసి కార్మిక చట్టాలను అమలుచేసి కార్మికులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ప్రతినిధి అయితరెడ్డి అప్పలనాయుడు, జన సాహితి జిల్లా కార్యదర్శి ఎస్.నూకాచారి, ఓపీడీఆర్ నాయకుడు శివాజీరావు, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఓపీఎస్ లక్ష్మీకుమారి, నవయువ సమైఖ్య నాయకుడు కె.మోహన్, పీడీఎస్‌వో నాయకులు భాస్కరరావు, సురేష్, ఎస్.రామకృష్ణ, పాల్గొన్నారు.

సబ్సిడీపై నవధాన్యాల విత్తనాల పంపిణీ



రైతులకు సబ్సిడీపై నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

చోడవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు మంచి పంట దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలో నర్సాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతున్న సమయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. తొలకరి వర్షాలకు ముందే ప్రకృతి వ్యవసాయం విధానంలో భూమిని సంరక్షిస్తే ఏడాదంతా పంటకు మేలు చేస్తుందని చెప్పారు. నవధాన్యాలు సాగు చేయడం వల్ల పశువులకు మంచి పోషకాహారం కూడా లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయని, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. మిశ్రమ పంటలు వేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని సూచించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై అపరాలు, నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ నాగమణి, చిన్న, నాయుడుబాబు, కె.శ్రీనివాసరావు, సర్పంచ్ దొడ్డి అప్పారావు, ఎంపీటీసీ బుద్ద సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దేవరాపల్లి: బోయిలకింతాడ సబ్‌స్టేషన్ పరిధిలోని వేచలం రూరల్ ఫీడర్, ఎం.అలమండ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు తెలిపారు. ఎం.అలమండ ఫీడర్ పరిధిలోని ములకలాపల్లి, కొత్తపెంట గ్రామాలకు, వేచలం రూరల్ ఫీడర్ పరిధిలోని వేచలం, బోయిలకింతాడ, కలిగొట్ల గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా ధ్యాన మందిరం ప్రారంభోత్సవం



దేవరాపల్లి సత్యసాయిబాబాను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: దేవరాపల్లిలో భగవాన్ సత్యసాయిబాబా ధ్యాన మందిరం ప్రారంభోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు సత్యసాయి బాబాకు విశేష పూజలు చేశారు. భక్తుల భక్తి గీతాలు, భజనలతో మందిర ప్రాంగణమంతా మార్మోగింది. బాబాను మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బాబా మందిరానికి స్థలం కేటాయించడంతో పాటు మందిర నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన ముత్యాలనాయుడును సత్యసాయి భక్తులు ఈ సందర్భంగా సత్కరించి, బాబా చిత్రపటాన్ని బహూకరించారు. స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు, కె.వి.రమణ, ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్, తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనకు వేలాదిగా భక్తులు తరలివచ్చి బాబా ప్రసాదాన్ని స్వీకరించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో పాటలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాడుగుల రూరల్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆంగ్లంలో కథలు చెప్పారు. గురువారం గ్రంథాలయ అటెండర్ వి.శృతి ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుందని ఆమె తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2004–05లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వివిధ రంగాల్లో స్థిరపడిన వీరంతా సుమారు 20 ఏళ్ల తరువాత ఒక చోట చేరి సందడి చేశారు. విద్యార్థి దశలోని మధుర స్మృతులను తలుచుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు జీవితాంతం రుణపడి ఉంటామని, పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు లెక్కల రాంప్రసాద్, సుర్ల సత్యవతి, నక్క సీతారాం పాల్గొన్నారు.

● ఆర్టీసీ బస్సు ఆపసోపాలు



వడ్డాది డైవర్షన్ రోడ్డు ఎక్కలేక అవస్థలు పడుతున్న ఆర్టీసీ బస్సు



అప్పు ఎక్కాక బస్సు ఎక్కడానికి పరుగులు తీస్తున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో ఓ చిన్నపాటి ఎత్తు(అప్పు)ను ఎక్కలేక ఆపసోపాలు పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గురువారం చోడవరం నుంచి నర్సీపట్నం ప్రయాణికులతో వెళ్తున్న ఏపీ29జెడ్157 నంబర్ గల ఆర్టీసీ బస్సు వడ్డాది పెద్దేరు వంతెనపై డైవర్షన్ రోడ్డు దిగి ఎక్కలేకపోయింది. సుమారు 40 మందితో వెళ్తున్న బస్సు అప్పు ఎక్కలేక కిందకి దిగిపోతుంది. వడ్డాది పెద్దేరు నదిలో నీరు ప్రవహించడంతో ప్రయాణికులు భయంతో కొంత మంది బస్సులో నుంచి కిందకు దిగేశారు. ఆర్టీసీ డ్రైవర్ అవస్థలు పడి బస్సును ఎలాగోలా పైకి ఎక్కించడంతో దిగిన ప్రయాణికులు పరుగులు తీసి మళ్లీ బస్సు ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఫిట్‌నెస్ లేని ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు ఇలా నిత్యం అవస్థలు పడుతున్నారు. – బుచ్చెయ్యపేట

పాతవలసలో చురుగ్గా రామాలయం నిర్మాణం



పాతవలసలో నిర్మాణ దశలో రామాలయం

కె.కోటపాడు : పాతవలస గ్రామంలో తలపెట్టిన రామాలయం నిర్మాణం చురుగ్గా సాగుతోంది. సర్పంచ్ జామి శ్రావణ్ పర్యవేక్షణలో గ్రామస్తులు ఈ ఆలయ నిర్మాణాన్ని దగ్గరుండి చేపడుతున్నారు. సుమారు రూ.50 లక్షల నిధులతో పాత రామాలయం స్థానంలోనే పునర్నిర్మిస్తున్నారు. ఆలయంతో పాటు ఎదురుగా మండప నిర్మాణం చేపడుతున్నారు. మరో రెండు నెలల్లో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని సర్పంచ్ తెలిపారు.